


మాట్లాడుతున్న ఎస్సై

## మహిళలకు రక్షణగా షీ బృందాలు

**మంథని గ్రామీణం, న్యూస్‌టుడే:** మహిళలకు రక్షణగా షీ బృందాలను ఏర్పాటు చేశామని ఏదైనా సమస్యలు ఏర్పడితే తమకు సమాచారం అందించాలని మంథని ఎస్సై ఉపేందర్‌రావు అన్నారు. మంథని మండలంలోని మల్లెపల్లి గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు షీ బృందాలపై ఎస్సై అవగాహన కల్పించారు. బృందాల పని తీరుపై వివరించారు. షీ బృందాలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షునిగా సత్యనారాయణగౌడ్

**మంథని గ్రామీణం:** తెలంగాణ గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షునిగా మంథని గ్రామానికి చెందిన మాచిడి సత్యనారాయణగౌడ్ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు ఐలి వెంకన్నగౌడ్ ప్రకటించారు.

## ఎంపీ వ్యాఖ్యలు అర్థరహితం

**పెద్దపల్లి కలక్టరేట్:న్యూస్‌టుడే:** తెలంగాణ ఉద్యమ సారథిగా ఉద్యోగులను ప్రజా సంఘాలను ఏకతాటిపై తీసుకొచ్చిన ఐకాస ఛైర్మన్ కోదండరాంపై పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు బాల్క సుమన్ అర్థరహిత వ్యాఖ్యలు చేస్తున్నారని కరీంనగర్ ఉమ్మడి జిల్లాల ఐకాస కోకన్వీనర్ రవి ఒక ప్రకటనలో ఆరోపించారు. సకల జనుల సమ్మె, సాగరహారం, షంషెడ్ యాత్ర పేరిట కోదండరాం తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ఉద్యమ పథంలో నడిపించారని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రేమ పొందేందుకే ఒక ఉద్యమనేతగా ప్రజాప్రతినిధి హోదాలో ఉన్న ఎంపీ చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. తెలంగాణ ఉద్యమంలో కనపడని వారు ప్రస్తుతం తెరాసలో కేబినేట్ మంత్రులుగా ఉన్నారని పేర్కొన్నారు. కోదండారంపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ఎలిగేడు, న్యూస్‌టుడే:** క్రిమి సంహారక మందుతాగి చికిత్సపొందుతున్న ఎలిగేడు గ్రామానికి చెందిన సత్యనారాయణరావు (60) మృతి చెందినట్లు జూలపల్లి ఎస్సై దేవేందర్ తెలిపారు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న సత్యనారాయణ రావు ఈనెల 4న ఇంట్లో క్రిమి సంహారక మందును తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కరీంనగర్ అస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.